వంతెన నిర్మాణం ఎప్పుడో?

కోడేరు: మండలంలోని ఖానాపూర్ వాగుపై వంతెన నిర్మాణం కలగానే మారుతోంది. ఎన్నో సంవత్సరాలుగా వాగుపై వంతెన నిర్మిస్తామని ప్రజాప్రతినిధులు చెబుతున్నా ఆచరణకు మాత్రం నోచుకోవడం లేదు. కోడేరు ఖానాపూర్ గ్రామస్తులు ఈ వాగుండనే పంట పొలాలకు వెళ్తుంటారు. ప్రస్తుతం వాగుపై తాత్కాలికంగా నిర్మించిన మట్టిరోడ్డుపై రాకపోకలు సాగుతున్నాయి. మట్టి రోడ్డు స్థానంలో శాశ్వత ప్రతిపాదకన బ్రిడ్జి నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు. కోడేరు ఖానాపూర్ గ్రామస్తులకు సంబంధించిన వ్యవసాయ భూములు దాదాపుగా 400 వందల ఎకరాలు ఖానాపూర్ వాగు అవతలి వైపు ఉన్నాయి. పొలాలకు రైతులు నిత్యం వాగు దాటి వెళ్లాల్సిందే. రెండు సంవత్సరాల కిందట వాగు ఉధృతికి మట్టి రోడ్డు కొట్టుకుపోయి ఓ వ్యక్తి వాగు ఉధృతికి కొట్టుకపోయి మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. వర్షాకాలంలో నీళ్లలోనే ప్రయాణాలు కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంటుందని స్థానికులు వాపోయారు. సమస్య పరిష్కారం కోసం గ్రామస్తులు, రైతులు వాగుపై తాత్కాలికంగా మట్టి రోడ్డును నిర్మించుకున్నారు. వర్షాకాలంలో మట్టి రోడ్డు కూడా పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ఏకమై సొంత ఖర్చులతో ఉన్న రోడ్డునే ప్రతిసారి మరమ్మతు చేసుకుంటున్నారు. సమస్య పరిష్కరించాల్సిన అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు కూడా చేయడం లేదుని విమర్శలు వినిపిస్తున్నాయి.


ఖానాపూర్ వాగుపై తాత్కాలికంగా నిర్మించిన మట్టిరోడ్డు

అంచనాలకే పరిమితం

వాగుపై వంతెన నిర్మిస్తామని ఐదేళ్లగా అధికారులు, పాలకులు హామీలు ఇస్తున్నారే తప్పా కాని ఆచరణలో అమలు కావడం లేదు. నిధుల మంజూరు కోసం అధికారులు ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపించేవరకే పరిమితం అవుతున్నారు. ఇప్పటి వరకు కూడ పనులు ప్రారంభం కాకపోవడం గమనార్హం. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ప్రాంత రైతులు కోరుతున్నారు.

అధికారులు దృష్టి సారించాలి



వాగుపై ప్రతి రోజు వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. గ్రామస్తులు రైతులు పొలాలకు వెళ్లేందుకు వాగుపై నుంచే వెళ్లాల్సిందే. ఇక్కడ బ్రిడ్జి నిర్మిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చారు. ఇప్పటి వరకు నిర్మాణాలు మాత్రం చేపట్టలేదు. అధికారులు వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలి.
– దాసు, రైతు, కోడేరు

త్వరలో పనులు ప్రారంభిస్తాం

పెద్దకొత్తపల్లి మండలం గంగ్రావుపల్లి నుంచి ఖానాపూర్ మీదుగా కోడేరు వరకు బీటీరోడ్డు, బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు అయ్యారు. మొత్తం రూ.4 కోట్ల నిధులు విడుదల అయ్యాయి. త్వరలో పనులు చేపడతాం. అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.
– కృష్ణ, ఏఈ, కోడేరు

క్లుప్తంగా

వాటర్ బాటిళ్లు పంపిణీ



చారకొండ: సిర్సనగండ్ల సీతారామచంద్రా స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం భక్తులకు భారతీ సిమెంట్ ఆధ్వర్యంలో వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ప్రతి ఏటా రెండు రోజులు పాటు భక్తుల సౌకర్యార్థం తాగునీరు అందిస్తామని సేల్స్ మేనేజర్ సతీష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ డీలర్ కరుణాకర్ రెడ్డి, సిబ్బంది నితిన్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

పరీక్ష ఫీజు చెల్లించండి

కొల్లాపూర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు మే 6వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ రమేష్‌లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సెమిస్టర్ పరీక్షలు మే 26 వతేదీ నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

చెక్ పంపిణీ

పెద్దకొత్తపల్లి: మండలంలోని ఇంద్రకల్ గ్రామానికి చెందిన జాఫర్ ఇటీవల మృతిచెందాడు. గతేడాది ఏడాది శ్రీరాంలైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలో పాలసీ తీసుకోవడంతో ఈమేరకు గురువారం మృతుడి జులేకాబేగానికి రూ.9.63 లక్షల విలువ గల చెక్‌ను సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ పంపిణీ చేశాడు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ రాజు, కాంగ్రెస్ నాయకులు దండు నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, రీజినల్ మేనేజర్ శ్రీహరి, బ్రాంచ్ మేనేజర్ నరేష్‌కుమార్‌రెడ్డి, మహమ్మద్‌హుస్సేన్, బద్దెనాయక్ పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా చర్యలు

తాడూరు: మండల కేంద్రంతోపాటు పాల్మూరు గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించి చేతి పంపులను ప్రెస్ అవుట్ చేస్తున్నట్లు ఎంపీఓ లక్ష్మన్‌నాయక్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని రెండో వార్డు, పాల్మూరులో ఉన్న చేతి పంపులను ప్రెస్ అవుట్ చేయించినట్లు పేర్కొన్నారు.

రికార్డుల పరిశీలన

తాడూరు: మండలంలోని ఎటిదార్‌పల్లి గ్రామ పంచాయతీని గురువారం ఎంపీడీఓ జ్యోతిపరోసియా ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. కార్యదర్శి మౌనిక, గ్రామస్తులు ఉన్నారు.

కూలీలకు మౌలిక వసతులు కల్పించాలి

కోడేరు: మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు కోరారు. గురువారం మండలంలోని తీగలపల్లిలో నర్సరీలో మొక్కలను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని ఎంపీడీఓ వెంకటరాములు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ దేవేందర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలిన నాయకులు

ఊర్కొండ: మహబూబ్ నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ నామినేషన్ దాఖలు చేయనుండటంతో గురువారం మండల పరిధిలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు మహబూబ్‌గర్ జిల్లా కేంద్రానికి తరలివెళ్లారు. ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, ఓర్సు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, కార్యకర్తలు ఉన్నారు.

తప్పిన పెను ప్రమాదం

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో కారు విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం శ్రీశైలం నుంచి మన్ననూర్ వైపు వెళ్తున్న కారు మన్ననూర్‌కు 6 కిలో మీటర్ల దూరంలో కొల్లం బేస్ క్యాంపు సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్తంభం విరిగిపడింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

వంట సామగ్రి చోరీ

కోడేరు: మండల కేంద్రంలోని అదర్శ పాఠశాలలో వంట సామగ్రిలు చోరీకి గురైన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ఈనెల 16న పాఠశాలలో మధ్యాహ్నం భోజనాలు వడ్డించి సామగ్రిని గదిలో ఉంచారు. 17న సెలవు దినం కావడంతో 18న ఎప్పటిలాగే గదిలోకి వెళ్లి సామగ్రిని చూడగా కనపించలేదు. గతంలో కూడా వంట సామగ్రి ఎత్తుకెళ్లారని నిర్వాహకులు వాపోయారు.

కేసు నమోదు

వెల్దండ: మండలంలోని నగారగడ్డతండాకు చెందిన రాత్లవత్ లోకిలాల్‌పై అదే తండాకు చెందిన కొర్ర బాలునాయక్ బుధవారం రాత్రి భూ వివాదంలో దాడిచేసి గాయపరిచారు. గురువారం లోకిలాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవి తెలిపారు.

మల్లురవిని గెలిపించుకుందాం


లింగాల మండలం అవుసలికుంటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

లింగాల: కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఎమ్మెల్యే వంశీకృష్ణ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని అవుసలికుంటలో పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. మండల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రంగినేని శ్రీనివాసరావు, నారాయణగౌడు, నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

బల్మూర్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో మాట్లాడారు. కాంగ్రెస్ కంచుకోట అయిన బల్మూర్ మండలంలో మల్లురవికి అత్యధిక మెజారిటీ అందించాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. అంతకుముందు పార్టీ కార్యకర్త కుమార్తె వివాహ వేడుకకు ఎమ్మెల్యే హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఖదీర్, గుళ్లవెంకటయ్య, సంపంగి రమేష్, వెంకటస్వామి, మహేష్, ఓంపతిరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డా మల్లు రవిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామన్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం అయ్యిందన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ ప్రధాన కార్యదర్శి ఎండీ కబీర్, కుమార్, శేషు, శ్రీను, ఎర్రశ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే విజయం

కల్వకుర్తిరూరల్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. పట్టణానికి చెందిన వ్యాపారవేత్త గుర్రాలరాంభూపాల్‌రెడ్డితో పాటు అతని అనుచరులు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఎంపీ రాములు సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కామారెడ్డి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలోనే భారతదేశ ఖ్యాతిని పెంచిన ఘనత ప్రధాన మంత్రి నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. ఎంపీ రాములు మాట్లాడుతూ పార్లమెంట్ అభ్యర్థి భరత్‌ప్రసాద్ విజయం కోసం అందరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట నాయకుడు ఆచారి, నర్సింహ, దుర్గప్రసాద్, శేఖర్‌రెడ్డి, కృష్ణాగౌడ్, రాఘవేందర్‌గౌడ్, నర్సిరెడ్డి, కృష్ణారెడ్డి, బాబిదేవ్ తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.


వ్యాపారవేత్త రాంభూపాల్‌రెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి ఎమ్మెల్యేకు సన్మానం

వెల్దండ: మండల కేంద్రంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సన్మానించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి భరత్‌ప్రసాద్ నామినేషన్ కార్యక్రమానికి వెళ్తుండగా మార్గమధ్యలో మండల కేంద్రంలోని కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండల అధ్యక్షుడు యాదగిరి, నాయకులు జంగయ్యయాదవ్, శశిధర్‌రెడ్డి, మోహన్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

బీజేపీలో చేరిక

బిజినేపల్లి: ఇటీవల డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి బీజేపీ గూటికి చేరారు. గురువారం ఆయన అనుచర వర్గం బీజేపీ కండువా కప్పుకున్నారు. తిమ్మాజిపేట మండలానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకులు జెట్టి వెంకటేష్, నాగేందర్‌గౌడ్‌లు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో జక్కా రఘునందన్‌రెడ్డి, శివ, కార్యకర్తలు ఉన్నారు.

ఇంటింటి ప్రచారం

పెంట్లవెల్లి: కేంద్రంలో బీజేపీ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్ర అన్నారు. మండలం కేంద్రంలోని పలు కాలనీలు ఇంటింటికి తిరుగుతూ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ను ఆశీర్వదించాలని కోరారు. మూలె వెంకటేష్, రవి, శివ, సాయినాథ్, రామకృష్ణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

దోమలపెంట: జాతీయ అగ్ని ప్రమాద వారోత్సవాలు పురస్కరించుకుని గురువారం భూగర్భ కేంద్రం ఫైర్ సేఫ్టీ సిబ్బంది ఆధ్వర్యంలో ఈగలపెంటలోని డీఏవీ ఆంగ్ల పాఠశాల విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మల్లిఖార్జున ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది విద్యార్థులకు ఎలక్ట్రికల్, మెటల్ ప్రమాదాలు సంభవించినప్పుడు డ్రై కెమికల్ పౌడర్ ఎలా ఉపయోగించి ప్రమాదాన్ని నివారించో వివరించారు. పెట్రోల్, డీజిల్, కిరోసిన్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కేంద్రం సేఫ్టీ అధికారి డీఈ శ్రీకుమార్‌గౌడ్ పర్యవేక్షించారు. ప్రిన్సిపల్ జె.ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్

అచ్చంపేట రూరల్: ఆర్టీసీ బస్సులో పడిపోయిన విలువైన బంగారు నగను మహిళకు అందించి అచ్చంపేట కండక్టర్ గంగాపురం హుస్సేన్, డ్రైవర్ కాశన్న నిజాయితీ చాటుకున్నారు. అచ్చంపేట ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులో అచ్చంపేట నుంచి దేవరకొండకు వెళ్తున్న ఓ మహిళా ప్రయాణికురాలు చెరుకుపల్లి స్టేజీ వద్ద దిగింది. బస్సులో చెవి కమ్మ పడిపోయింది. గమనించిన ప్రయాణికురాలు డిపో మేనేజర్‌కు ఫోన్ చేసి వివరాలు చెప్పింది. అప్పటికే కండక్టర్‌కు చెవికమ్మ బస్సులో కనిపించింది. దేవరకొండ నుంచి తిరుగు ప్రయాణంలో మహిళకు చెవి కమ్మను కండక్టర్ అందించారు. నగ విలువ సుమారు రూ. 50వేలు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన అంకెల వరలక్ష్మి వివాహానికి తల్లిదండ్రులు ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శేఖర్‌రెడ్డి రూ.10వేలు, బీజేపీ మండల అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి రూ.2వేలు గురువారం ఆర్థికసాయం అందజేశారు.

పెద్దకొత్తపల్లి: దేవల్‌తిరుమలాపూర్ గ్రామానికి చెందిన గడ్డం నర్సింహ అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి గురువారం కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పి శ్రీనివాస్‌రెడ్డి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన అనుపటి నాగరాజు అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు, కాలనీవాసులు బాధిత కుటుంబసభ్యులకు రూ. 5 వేలు ఆర్థికసాయం అందజేశారు. శ్రీను, ఎల్లయ్యయాదవ్, తిరుపతి, బాలకృష్ణ, చిన్నజంగయ్య, నిరంజన్‌గౌడ్ ఉన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని సాయినగర్ కాలనీకి చెందిన మహేశ్వరి, రాఘవేందర్ కుమార్తె చిన్నారి ప్రగతి కొన్ని రోజులుగా గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న కాలనీకి చెందిన రిటైర్డ్ జీహెచ్ఎం నర్సోజి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

వాల్ పోస్టర్ విడుదల

నాగర్‌కర్నూల్‌రూరల్: కార్మిక దినోత్సవాన్ని మే 1న ఘనంగా నిర్వహించుకుందామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మే డే దినోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. చిన్నపాగ శ్రీనివాసులు, కొత్త రామస్వామి, వాడాల బాలపీర్, ఆంజనేయులు, కవిత, రాములు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులను విక్రయించాలి



వెల్దండ: నాణ్యమైన ఎరువులను విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ డీలర్లకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలు, సింగిల్‌విండో కార్యాలయంలో ఎరువులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ షాపుల వారు స్టాక్ వివరాలు, ఎరువుల ధరలను పట్టికలో బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ మంజుల, దకాణా యజమానులు ఉన్నారు.

వివాహిత అదృశ్యం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని టంగాపూర్ కాలనీకి చెందిన ఓ వివాహిత కుటుంబ కలహాలతో నెల వయసున్న కుమారుడితో ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లింది. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. వివాహిత తల్లి అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాములు తెలిపారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఉప్పునుంతల: మండల సరిహద్దులోని దుందుబీ నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను గురువారం మండలంలోని జప్తీ సదగోడు సమీపంలో పట్టుకున్నారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల యజమానులు మొల్గరకు చెందిన గోవింద్ మల్లేష్, నిరంజన్, ఆనంద్, శేఖర్‌తోపాటు వంగూరు మండలం మిట్టసదగోడుకు చెందిన మల్లేష్‌పై కేసులు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రతి ఒక్కరు సేవాభావం కలిగి ఉండాలి

వెల్దండ: ప్రతి ఒక్కరు సేవాభావం కలిగి ఉండాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, సీఎం సోదరుడు కృష్ణారెడ్డిలు అన్నారు. గురువారం మండల కేంద్రంలో రిక్రేషియన్ క్లబ్‌లో వెంకటరమణ, యశోద ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. పేదల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా శిబిరంలో వారు పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం దాదాపుగా 450 మంది రోగులకు పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, సంజీవ్‌కుమార్, కృష్ణారెడ్డి, ఆంజనేయులు, శిశుపాల్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, వెంకట్‌నాయక్, మోతిలాల్‌నాయక్, ఎర్రశ్రీనుముదిరాజ్, వైద్యులు వీరమల్ల శరత్, రంజిత్, ధర్మతేజ, సంతోషిణి, నితిన్, మానస, ఉమాదేవి, నాగరాజు, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ రవి, తదితరులు ఉన్నారు.


వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

చారకొండ: శ్రీరామనవమి సందర్భంగా మండల కేంద్రానికి చెందిన గ్రామీణ వైద్యులు చిల్వేరు శ్రీనివాసులు సిర్సనగండ్ల గుట్టపై భక్తుల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. భక్తులకు అవసరం అయిన మందులు అందజేస్తున్నారు. వారం రోజులపాటు శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

బీఎంపీ అభ్యర్థికి బీఫాం అందజేత



బీఫాం అందుకుంటున్న విజయ్

నాగర్‌కర్నూల్‌రూరల్: నాగర్‌కర్నూల్ బహుజన ముక్తి పార్టీ పార్లమెంట్ అభ్యర్థిగా ఎంపికైన గడ్డం విజయ్‌కి గురువారం ఆ పార్టీ రాష్ట కార్యాలయంలో రాష్ట అధ్యక్షుడు అంసోల్ లక్ష్మన్, జాతీయ ఉపాధ్యక్షుడు ధనురాంనాయక్ బీఫాం అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థి విజయ్ మాట్లాడుతూ అభ్యర్థులు డబ్బు, మద్యంతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు హామీలను నమ్మి మోసపోవద్దన్నారు. 85 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు బీఎంపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. అంబేద్కర్, కాన్సీరాం ఆలోచన విధానాలను అమలు చేస్తామన్నారు. మంచం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్ఎస్పీకి మద్దతుగా ఇంటింటి ప్రచారం

కొల్లాపూర్: పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కష్టపడి ఎదిగిన వ్యక్తి అని, ఆయన ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి పరిష్కారం కోసం కృషి చేస్తారని వివరించారు. ఆర్ఎస్పీని ఎంపీగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నరేందర్‌రెడ్డి, కాటం జంబులయ్య, కారంగి బ్రహ్మయ్య, కట్టా శ్రీనివాసులు, కలమూరి నిరంజన్, నర్సింహ్మ, విక్రమ్‌పాషా, బిజ్జవేణు, మామిళ్లపల్లి శ్రీనివాసులు, శ్రీరామ్, మోహన్ తదితరులు ఉన్నారు.


ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వైభవంగా రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

ఉప్పునుంతల: శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం తెల్లవారుజామున స్థానిక కేదారేశ్వర చెన్నకేశవ స్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను రథంపై ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఆలయం నుంచి పోచమ్మ చౌరస్తా వద్దకు రథాన్ని భక్తులు, గ్రామస్తులు ఉత్సాహంతో లాగారు. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరై స్వామివారికి పూజలు చేశారు. భక్తులతో కలిసి ఎమ్మెల్యే భజన కీర్తనలకు ఆలపించారు. అంతకుముందు హోమం, కుంభం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కొత్త జంగిరెడ్డి, అనంతరెడ్డి, నర్సింహ్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండు రోజులపాటు నిర్వహించే అంతర్రాష్ట ఎద్దుల బండలాగుడు పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జూనియర్ విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఆయా ప్రాంతాల నుంచి ఎనిమిది జతల ఎద్దులు పాల్గొన్నాయి. నాలుగు జతల ఎద్దులను విజేతలుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ లెనిన్, కొత్త పెద్ద జంగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, నారాయణ్‌రెడ్డి, అనంతరెడ్డి, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఇంద్రకల్‌లో..

తాడూరు: మండలంలోని ఇంద్రకల్‌లో చెన్నకేశవ ఆలయ ఆవరణలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రథాన్ని పూలతో అలంకరించారు. పూజారి కోదండరామశర్మ, పట్నం సురేష్‌శర్మ, మాజీ సర్పంచ్ వెంకటయ్య, వినోద్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరాముడి పట్టాభిషేకం

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం సీతారామచంద్రస్వామి పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయం ఆవరణలో ఉత్సవ విగ్రహాలను ఉంచి ఆలయ ప్రధాన అర్చకులు రామాచారి ఆధ్వర్యంలో సుదర్శనాచారి తదితర వేద బ్రాహ్మణ మంత్రోచ్ఛరణల మధ్య పట్టాభిషేకం చేశారు. హనుమంతు వాహన సేవ భక్తి శ్రద్ధలతో కొనసాగింది. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించగా భక్తులు మంగళహారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పూజారి భాస్కర్, మహిళా అధ్యక్షురాలు ఇందిరమ్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


పట్టాభిషేకం నిర్వహిస్తున్న పూజారి

అతిథి అధ్యాపకుల సేవలు కీలకం

బల్మూర్: కళాశాల అభివృద్ధిలో అతిథి అధ్యాపకుల సేవలు కీలకమని ప్రిన్సిపాల్ డా. రామచంద్రం అన్నారు. మండలంలోని కొండనాగుల ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అతిథి అధ్యాపకుల క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కళాశాల అడ్మిషన్లు పెంపునకు అతిథి అధ్యాపకులు ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అతిథి అధ్యాపకుల రాష్ట అధ్యక్షుడు డా.కొర్ర ఈశ్వర్‌లాల్, డా. కృష్ణగోపాల్, అతిథి అధ్యాపకులు కిరణ్‌కుమార్, మల్లయ్య, గోపాల్, వెంకటస్వామి, బాలరాజు, గాయత్రి, ముంతాజ్, అశోక్‌కుమార్, లక్ష్మాగౌడ్, పరంగి రవి, జానీ బాబు పాల్గొన్నారు.

పురస్కారాలు అందజేత

అచ్చంపేట రూరల్: సమాజంలో సామాజిక సేవ చేస్తున్న పలువురికి అంజనీమాత సేవా సమితి ఆధ్వర్యంలో సీతారామ పురస్కారాలను అందజేశారు. కరోనా సమయంలో ఆదివాసీలకు సేవలందించిన గట్టు అశోక్‌రెడ్డి, వలస కార్మికులకు చేయూతనందించిన పోల సాయిబాబు, కరోనా బాధితులకు సేవలందించిన మండికారి బాలాజీ, రాందాస్, మధుసూదన్‌కు గురువారం పురస్కారాలతో జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షురాలు సునీతాబాయి, ప్రధాన కార్యదర్శి శకుంతల, కోశాధికారి హేమలత, కృష్ణవేణి, చంద్రకళ, సంగీతాబాయి, సంధ్య, రవీందర్, శంకర్ లింగం, ఆంజనేయులు, హరికృష్ణ, అశ్విని, వరలక్ష్మి పాల్గొన్నారు.